క్లుప్తంగా

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే చర్యలు

సూర్యాపేట క్రైం : మాదక ద్రవ్యాలు వాడినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో గంజాయి బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



తిరుమలగిరిలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి : తుంగతుర్తి శాసన సభ్యుడిగా ఎన్నికైన మందుల సామేల్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలగిరిలో సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, మూల అశోక్‌రెడ్డి, సుంకరి జనార్దన్, తిరుమని యాదగిరి, బత్తుల శ్రీను, కందుకూరి లక్ష్మయ్య, రాపాక సోమేష్, హీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి శాసనసభ్యుడిగా గెలుపొందిన మందుల సామేల్‌ను నాగారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ధర్మారంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించారు. పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, గ్రామశాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, ఎలుక కర్ణాకర్, గద్దల సైదులు, కొలిపాక సాయి, పాల్వాయి పరశురాములు, ఆవుల నరేష్, మహేష్, చంద్రశేఖర్, వెంకన్న, రమేష్, రాజు, సోమయ్య, ముత్తయ్య, వెంకటయ్య, వీరయ్య, కృష్ణ, బాబు, మధు, నరేష్, ఉమేష్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

నాగారం : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తిరుమలగిరిలో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం జరగుతుందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బీవైఎస్ మండల యూత్ అధ్యక్షుడిగా గణేష్



నియామకపత్రాన్ని అందిస్తున్న నాయకులు

తుంగతుర్తి : భారత యాదవ సమితి (బీవైఎస్) మండల యూత్ అధ్యక్షుడిగా తుంగతుర్తికి చెందిన బోయిని గణేష్‌యాదవ్ మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నికృష్ణ యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం యూత్ అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన యాదవ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సైదులు, మహేష్, అనిల్, పవన్, రాకేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఇరుముడి

నూతనకల్ : మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర ఆలయంలో అయ్యప్ప ఇరుముడి కార్యక్రమాన్ని భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాల ధరించి కఠోర దీక్షలు నిర్వహించిన భక్తులు ఇరుముడులతో శబరిమలకు తరలివెళ్లారు.

బియ్యం అందజేత

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకుడు కడియం నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి బొల్లంపల్లి గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోసుల విజయ్ మంగళవారం బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోనేటి రంగయ్య, ఖమ్మంపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల సర్వే

నూతనకల్: పెదనెమిల గ్రామంలో బడి ఈడు, బడిబయట పిల్లలను గుర్తించడం కోసం అధికారులు మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీ కనకం రవి మాట్లాడారు. గ్రామంలో బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రతి ఒక్కరినీ పాఠశాలకు పంపే విధంగా సర్వేలు చేస్తున్నట్లు తెలిపారు.



పెద నెమిలలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ

ప్రభుత్వం నుంచి ప్రైవేట్‌కు..

- కమీషన్ల కోసం రోగులను ప్రైవేట్ హాస్పిటళ్లకు పంపుతున్న జిల్లా ఆస్పత్రి సిబ్బంది
- మార్కెటింగ్ ఏజెంట్లుగా పనిచేస్తున్న వైనం



జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి

సూర్యాపేట : కంచే చేను మేసిన చందంగా తయారైంది జిల్లా ఆస్పత్రి పరిస్థితి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చికిత్స కోసం వచ్చే పేషెంట్లను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. కమీషన్ల కోసం రోగులు ఆస్తులు అమ్ముకునేలా చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రులు ఎక్కువ కావడంతో పోటీ పెరిగింది. వచ్చిన పేషెంట్లను వచ్చినట్లు తరలించుకుపోయేందుకు ప్రైవేటు ఆస్పత్రుల యజమాన్యాలు పన్నాగం చేశాయి. ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా జిల్లా ఆస్పత్రి సిబ్బందినే మార్కెటింగ్ ఏజెంట్లుగా నియమించుకుని దందా కొనసాగిస్తున్నాయి. మరికొంత మందికి కమీషన్లు ఇస్తూ పేషెంట్లను ప్రైవేటు ఆస్పత్రులకు పంపించేలా మభ్యపెడుతున్నాయి.

అడిగినంత వేతనం, కమీషన్..

ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు మార్కెటింగ్ ఏజెంట్లుగా నియమించిన వారికి అడిగినంత వేతనం ఇవ్వడంతో పాటు పేషెంట్లను పంపించినప్పుడు బిల్లుల నుంచి కమీషన్లు ఇస్తున్నారు. దీంతో జిల్లా ఆస్పత్రి సిబ్బంది పేషెంట్లను పంపించడం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లను భయపెట్టి, ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. కమీషన్లు దండుకోవడం కోసం నిరుపేదలను ఆర్థిక దోపిడీ చేస్తున్నారు.

కిందిస్థాయి సిబ్బందే టార్గెట్..

జిల్లా ఆస్పత్రిలో పనిచేసే కిందిస్థాయి సిబ్బందే లక్ష్యంగా ప్రైవేటు ఆస్పత్రులు పేషెంట్ల కోసం చక్రం తిప్పుతున్నాయి. సిబ్బందికి డబ్బులు ఎర వేసి వారిని దారికి తెచ్చుకుంటున్నాయి. పేషెంట్లను ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌లను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. కొద్ది రోజులు పేషెంట్లను పంపిన తర్వాత సదరు సిబ్బందే స్వతహాగా అంబులెన్స్ కొనుగోలు చేసి పేషెంట్లను తరలించడం సర్వ సాధారణంగా మారింది. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఇంత తంతు జరుగుతున్నా సూపరింటెండెంట్ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఆస్పత్రిలో పనిచేసే ఐదారుగురు సిబ్బందికి సొంత అంబులెన్స్‌లు కూడా ఉన్నట్లు సమాచారం.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

కిందిస్థాయి సిబ్బంది పేషెంట్లను ప్రైవేటు ఆస్పత్రులకు పంపించే విషయంపై బాధితులు ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వాస్పత్రిలో వైద్యసిబ్బంది, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. పేషెంట్లు ఇతరుల మాటలు నమ్మి మోసపోవద్దు.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి

ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలకు శిక్షణ



అర్వపల్లిలో బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు



నూతనకల్: మాట్లాడుతున్న ట్రైనర్ రవీందర్‌బాబు

తిరుమలగిరి : నూతనంగా ఓటు హక్కు నమోదుపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమణారెడ్డి మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : కొత్తగా ఓటర్ల నమోదు, సవరణల కార్యక్రమంపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఓటరు సవరణ ఎలా చేపట్టాలనే విషయమై బీఎల్‌ఓలకు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఏఎంఎల్‌టీ పగిళ్ల సైదులు శిక్షణ ఇచ్చారు. కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఆర్‌ఐలు కరుణాకర్, నవీన్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు జలంధర్‌రావు, పాష పాల్గొన్నారు.

నూతనకల్ : ఓటరు జాబితా సవరణకు బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు కృషి చేయాలని ఏఎల్‌ఎంటీ రవీందర్‌బాబు కోరారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో ఓటరు నమోదుపై ఉన్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని, మరణించిన వారి పేర్లను తొలగించాలని, వలస ఓటర్లను గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : అయ్యప్ప దీక్ష కఠోర నియమాలతో కూడుకున్నప్పటికీ దాని వల్ల మానసిక ఆనందం, ఆత్మ పరిశీలన శక్తి, అపూర్వమైన ఆధ్యాత్మిక ఆనందం లభిస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. స్థానిక శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి–సునీత దంపతుల ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం ఆవరణలో మంగళవారం శ్రీఅయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర్యాపేటకు చెందిన గురుస్వాముల నేతృత్వంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, వేలాది మంది అయ్యప్ప స్వాములు, భక్తులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొని గీతాలను ఆలపించారు. అనంతరం స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్, రాచకొండ దేవయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ వెంకట్‌రెడ్డి, ఎర్రంశెట్టి ఉపేందర్, జేపీటీ తదితరులు పాల్గొన్నారు.

సీపీయూఎస్‌ఐ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీయూఎస్‌ఐ నాయకులు

తుంగతుర్తి: ఈనెల 25 నుంచి 31 వరకు సీపీయూఎస్‌ఐ(కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా) ఆవిర్భావ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న కోరారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెంలో మారోజు వీరన్న స్థూపం వద్ద ఆ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. సామాజిక, రాజకీయ నిర్ణయాత్మక, రాజ్యాధికార శక్తిగా ఎదగడానికి మారోజు వీరన్న తన జీవితాన్ని ధార పోశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీయూఎస్ జిల్లా కార్యదర్శి మట్టపెల్లి లింగయ్య, కొండా శ్రీను, ఎర్ర సత్యం, మట్టపెల్లి యాదయ్య పాల్గొన్నారు.

పబ్లిక్ క్లబ్ అవినీతిపై విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

భానుపురి : సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌లో జరుగుతున్న అవినీతి, అవకతవకలపై సూర్యాపేట ఆర్డీఓ విచారణ జరపాలని పబ్లిక్ క్లబ్ సీనియర్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది నూకల సుదర్శన్ రెడ్డి, మాజీ కార్యదర్శి బొల్లెద్దు దశరథ అన్నారు. మంగళవారం క్లబ్ ఆవరణలో జరిగిన సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. పబ్లిక్ క్లబ్ సెక్రటరీగా కొప్పుల వేణారెడ్డి పనిచేసిన సమయంలో దుకాణ సముదాయం నిర్మాణం, జిమ్ సెంటర్ ఏర్పాటుతో ఆదాయం పెరిగిందన్నారు. క్లబ్ ఆదాయం లక్షల్లో ఉన్నప్పటికీ ప్రస్తుత సెక్రటరీ క్లబ్ ఆదాయ, వ్యయాలను కమిటీ సభ్యులకు తెలపడం లేదన్నారు. సెక్రటరీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. 12 నెలలకు ఒకసారి జనరల్ బాడీ మీటింగ్ పెట్టాల్సి ఉన్నా నిర్వహించడం లేదన్నారు. క్లబ్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై క్లబ్ చైర్మన్, సూర్యాపేట ఆర్డీఓ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పబ్లిక్ క్లబ్ సభ్యులు ఎల్గురి చంటి బాబు, శనగాని రాంబాబు, కుమ్మరికుంట్ల లింగయ్య, గవ్వా కేశవ రెడ్డి, రావుల రాంబాబు, అంజద్ అలీ, షేక్ సైదులు, రుద్రంగి రవి, నాగుల వాసు, రావుల రాంబాబు, యలగందుల సాయినేత, గుణగంటి సైదులు, కుందామల్ల శేఖర్, ఎల్గురి వెంకటేశం, రాపర్తి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరికి చేరిన అయోధ్య రాముడి తలంబ్రాలు



ఫణిగిరి రామాలయంలో అయోధ్య రాముడి తలంబ్రాలతో ధర్మ జాగరణ కమిటీ సభ్యులు

నాగారం : అయోధ్యలో జనవరి 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న అయోధ్య రాముడి తలంబ్రాలు మంగళవారం మండల పరిధిలోని ఫణిగిరి రామాలయానికి చేరాయి. ఈ సందర్భంగా ధర్మ జాగరణ కమిటీ సభ్యురాలు జక్కుల అలివేలుమంగ మాట్లాడారు. ఫణిగిరిలోని రామాలయంలో జనవరి 1న నాగారం మండలంలోని 14 గ్రామాలకు గానూ 14 కలశాల్లో అక్షింతలు నింపి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామానికి ఒక కలశం చొప్పున అక్షింతలను గ్రామాలకు చేరవేస్తామన్నారు. గ్రామాలకు అక్షింతలతో పాటు శ్రీరాముడి ప్రతిమను అందజేయనున్నట్లు తెలిపారు. అయోధ్య రాముడి తలంబ్రాలు తలపై చల్లుకోవడం, పొలాల్లో చల్లుకోవడం ద్వారా రాముడి ఆశీస్సులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ జాగరణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంచాలి



పొట్లపహాడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి

పెన్‌పహాడ్ : నర్సరీల్లో మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని మండల ప్రత్యేక అధికారి రాంపతి నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్, పొట్లపహాడ్, అన్నారం బ్రిడ్జి గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీల్లోని సంచుల్లో నాటిన విత్తనాలు మొలకెత్తి ఏపుగా పెరగాలంటే ప్రతి రోజు నీళ్లు పోయాలన్నారు. అంగన్‌వాడీ, హెల్త్ సబ్‌సెంటర్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పొట్లపహాడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి, ఈసీ ఏకస్వామి, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, విద్యాధర్, సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు జ్యోతి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డబ్ల్యూఎంఈ సంస్థ డైరెక్టర్

పెన్‌పహాడ్ : అనంతారం గ్రామంలోని డబ్ల్యూఎంఈ సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్ల్యూఎంఈ సంస్థ డైరెక్టర్ పి. జాన్‌మార్క్ మాట్లాడారు. అనంతరం సెమీ క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. పేదలకు, వితంతువులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మామిడి రేవతిపరందాములు, ఉప సర్పంచ్ మామిడి మైసయ్య, పాస్టర్ సీమోన్, స్టీఫెన్ పాల్ ఇమ్మానియేల్, మామిడి దుర్గమ్మ, ధనమ్మ, మామిడి ప్రవీణ్, నవీన్, జాకోబ్, జాన్, రాజు, మామిడి వెంకన్న, పల్లెపంగి మధు తదితరులు పాల్గొన్నారు.

విద్య, విద్యుత్, రోడ్లకు మొదటి ప్రాధాన్యం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధితో పాటు విద్య, విద్యుత్, రోడ్లకు తన మొదటి ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుండగాని కవిత రాములు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత పాలకుల హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, ఐబీ డీఈఈ, ఏఈఈలు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే కేటాయించాలన్నారు. గ్రామాల్లోని విద్యుత్ లైన్‌లను సరిచేయాలని, రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తిమ్మాపురం నుంచి సంగెం, వెంకేపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.20కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలుపడంతో రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు, తండాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, రోడ్లు లేని తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించడానికి ఎన్ని నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రితో మాట్లాడి రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. గతంలో చేసిన పనులకు తమకు బిల్లులు రాలేదని సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్య పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కేజీబీవీలో మౌలిక వసతులు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కలెక్టర్ వెంకట్రావు, డీఈఓ అశోక్‌లకు ఫోన్‌చేసి పాఠశాలలోని సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను తనకు వెంటనే అందించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా తుంగతుర్తికి రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ భీంసింగ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గర్భిణులకు పౌష్టికాహారం



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మద్దిరాల : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి అన్నారు. మంగళవారం ముకుందాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఏర్పాటు చేసిన సామూహిక సీమంతంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సాహెదా, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డులు అందుకున్న సూర్యాపేట నేడు ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురికి వాసనతో దుర్భరమైన పరిస్థితుల్లో ఉందన్నారు. మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అతి దారుణంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిల్లలమర్రి, ఖాసింపేట, ఇందిరమ్మ కాలనీ వంటి ప్రాంతాల్లో పరిస్థితి అతి దారుణంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, పార్టీ జిల్లా నాయకుడు పేర్ల నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాల కోసం రైతుల ఎదురుచూపు



నీళ్లు లేక వెలవెలబోతున్న 71డీబీఎం కాలువ



ఎండిపోతున్న దున్నిన వరిపొలాలు

అర్వపల్లి : గోదావరి జలాల కోసం అన్నదాతలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరం కావాల్సి ఉంది. కానీ ఇంతవరకు ఈ సీజన్‌కు సంబంధించి గోదావరి జలాల విడుదలపై నీటిపారుదలశాఖ అధికారులు షెడ్యూల్ ప్రకటించకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్సారెస్పీ రెండోదశ కింద 1.40లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఆయకట్టు పరిధిలోని రైతులందరు నిత్యం ఈ నీటికోసమే వేచిచూస్తున్నారు. ఇప్పటికైనా గోదావరి జలాల విడుదలపై షెడ్యూల్ ప్రకటించాలని నియోజకవర్గ రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి..



నీళ్లు రాక సాగుకాని వరి పొలాలు

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

ఆత్మకూరు(ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో జరుగుతున్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవ పూజలకు మాజీ మంత్రి, కాంగ్రెస్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కందాల వెంకటరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కాకి జార్జి రెడ్డి, గోపగాని సత్యం, వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, సతీష్, పాండు నాయక్, సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్న యాదవ్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి

మద్దిరాల : భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాక అమృతమల్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అన్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన వెంకన్నకు భువనగిరి పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు కోడి కుమార్‌యాదవ్, పులిగిలి లింగయ్య, కసనబోయిన లింగయ్య, ఉపేందర్, సురేష్, మామునూరి ఉపేందర్, ఎల్లేష్, గొండ్యాల రమేష్, పులుగుజ్జ యాకయ్య, నల్లగంటి నరేష్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి యాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల సందర్భంగా మంగళవారం సుబ్రహ్మణ్య యాగం ఘనంగా నిర్వహించారు. నారాయణ బలి పూజ, సుబ్రహ్మణ్య యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి సర్పాకార దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రెంటాల సతీష్ శర్మ, దేవాలయ కమిటీ అధ్యక్షుడు అనంతుల సూర్యనారాయణ, సభ్యులు అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ మహాపడిపూజ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామంలో మంగళవారం హనుమాన్ మాలధారులు మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారుడు కలకోట్ల సందీప్ 50మంది హనుమాన్ మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాలధారులు జీడి శ్రవణ్, కౌశిక్, విష్ణు, శ్రీరాం, అంజి, నాగరాజు, సింధు, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.